అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- అధికారులతో సమావేశం

బోథ్: ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను సన్మానిస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ, నాయకులు

బోథ్, డిసెంబర్ 18 : బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సోమవారం బోథ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం క్యాంపు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అవసరమైన వాటిని తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యేగా తను ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఏ సమస్య ఉన్న నేరుగా తెలుపవచ్చన్నారు. సమావేశంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జడ్పీటీసీ ఆర్ సంధ్యారాణి, ఏఎంసీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణ్ రెడ్డి, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, నేరడిగొండ ఎంపీపీ రాథోడ్ సజన్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాహెర్ బిన్ సలాం, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మండలంలోని ధన్నూర్(బీ) గ్రామం నుంచి నాగపూర్ వరకు రూ.2 కోట్ల 10 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్పీటీసీగా ఉన్నప్పుడు ఈ రోడ్డు మంజూరు చేయించానని తెలిపారు. అనంతరం రెడ్డి సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఇచ్చోడ, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని ఇచ్చోడ మెయిన్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జాదవ్ అనిల్ భూమిపూజ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను జడ్పీటీసీ ఉన్న సమయంలో కేసీఆర్ రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్ల 60 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇచ్చోడ మెయిన్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులను తన హయాంలో పూర్తి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏనుగు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ గాడ్గె సుభాష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

నేరడిగొండ, డిసెంబర్ 18: ప్రభుత్వ కళాశాలతో పాటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించిందన్నారు. పాఠశాలల్లో మన ఊరు –మన బడి కార్యక్రమం ద్వారా మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతి మండలంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యారంగంలో విద్యార్థులకు అన్ని రకాలుగా వసతులు కల్పించినట్లు గుర్తు చేశారు. విద్యార్థులు విద్యారంగంలో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులతో పాటు గురువులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాలలో రూ.8లక్షలు మూత్రశాలల నిర్మాణానికి వెచ్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వైస్ఎంపీపీ మహేందర్ రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్ సింగ్, నాయకులు సయ్యద్ జహీర్, సుజీల్ కుమార్, మదన్ సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ శబనతర్నం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరడిగొండ: జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి
- జిల్లా స్థాయి పోలీసు క్రీడలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

ఎదులాపురం, డిసెంబర్ 18 : క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని గెలుపోటములు సహజమని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం నిర్వహించిన ఆదిలాబాద్ జిల్లా స్థాయి పోలీసు క్రీడలను ఎస్పీ ప్రారంభించారు. జిల్లా స్థాయి క్రీడల్లో ఐదు బృందాలు ఏఆర్‌హెడ్‌క్వార్టర్స్, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ, ఆదిలాబాద్, ఉట్నూర్ సబ్ డివిజన్లు, హోంగార్డు టీం పాల్గొంటున్నాయి. ముందుగా ఎస్పీ జాతీయ జెండాను ఎగురవేశారు. ఐదు బృందాలచే పరేడ్ నిర్వహించి కమాండర్‌గా వ్యవహరిస్తున్న ఆర్ఐ నవీన్, ఎస్పీకి గౌరవ వందనాన్ని సమర్పించారు. అలాగే శాంతికపోతాలను, బెలూన్లను ఎగురవేసి క్రీడాకారులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోలీసులకు శారీరక దృఢత్వం చాలా ముఖ్యమైనదని దాన్ని కాపాడాలంటే క్రీడలతోని సాధ్యమవుతుందన్నారు. జిల్లా స్థాయి క్రీడల్లో ఐదు బృందాలు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ ఏఆర్‌హెడ్‌క్వార్టర్స్, ఉట్నూర్ సబ్ డివిజన్ మధ్య కొనసాగిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్ క్రీడను వీక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ డీసీఆర్బీ సీహెచ్ శ్రీనివాస్‌జీ, సీఐలు ఏ అశోక్, కే నరేశ్ కుమార్ , ఈ భీమేశ్, ఆర్ఐ సీఐలు టీ మురళి, స్వామి, నవీన్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్ఐ సిబ్బంది, సబ్ డివిజనల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి పూజలు



సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 18 : ఆదిలాబాద్‌లోని రవీంద్రనగర్, బెల్లూరి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి పూజలు వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సోమవారం సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాదిగా జంటలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పూజ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మాజీమంత్రి జోగు రామన్న దంపతుల ప్రత్యేక పూజలు

బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో మాజీ మంత్రి జోగు రామన్న సతీమణి రమాదేవి సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు జోగు రామన్న దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఆలయాభివృద్ధిలో తమవంతు ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, వేణు యాదవ్, బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయ అధ్యక్షుడు శ్రీ కుంబోజి సూర్యకాంత్ స్వామి, ఆలయ ప్రధాన కార్యదర్శి రవీందర్, ఆలయ వ్యవస్థాపక సభ్యుడు తాటిపెల్లి శివప్రసాద్ గురుస్వామి, ఆలయ తంత్రి సాయికృష్ణ దుబే, ఆలయ మాజీ ప్రధాన కార్యదర్శులు చందగణేశ్ గురుస్వామి, ఆలయ కోశాధికారి టింగం నరేశ్ గురుస్వామి, దిలీప్ గురుస్వామి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లోని రవీంద్రనగర్ అయ్యప్ప స్వామి ఆలయం వద్ద సుబ్రహ్మణ్య స్వామి పూజ చేస్తున్న భక్తులు

స్థానిక సంస్థల బలోపేతానికి కృషి

అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవోలు

నిర్మల్ టౌన్, డిసెంబర్ 18 : నిర్మల్ జిల్లాలో స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటానని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఫైజన్ అహ్మద్‌ను నియమించడంతో సోమవారం స్థానిక సంస్థల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించా రు. జిల్లాలోని 18 మండలాలతో పాటు భైంసా, నిర్మల్, ఖానాపూర్ మున్సిపాలిటీలో గల స్థానిక సంస్థల అధికారులు,ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిధులతో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన అదనపు కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలెక్టర్ అశిష్ సంగ్వాన్, రెవెన్యూ కలెక్టర్ కిశోర్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను చేపట్టిన ఫైజన్ అహ్మద్‌ను డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారితో పాటు ఎంపీడీవోలు, నాయకులు తహసీల్దార్లు, డీపీఆర్వో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా చూడాలి

- నిర్మల్ కలెక్టర్ అశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 18: నిర్మల్ జిల్లాలో ఈ విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ అశిష్ సంగ్వాన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ అభివృద్ధిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మన ఊరు– మన బడి కింద ఇప్పటి వరకు చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, ఇంకా మిగిలిన పనులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని పనులను వెంటనే పూర్తి చేసి పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించాలని సూచించారు. విద్యార్థులకు సిలబస్‌ను పూర్తి చేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.